సాక్షి
మంచిర్యాల
ఆదివారం । 17 । ఆగస్టు । 2025



ఘనంగా కృష్ణాష్టమి

జిల్లాలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు గోపిక, కృష్ణుల వేషధారణతో ఆకట్టుకున్నారు. పలు ప్రాంతాల్లో ఉట్టికొట్టే కార్యక్రమాలు నిర్వహించారు. 9లో▸



ఎల్లంపల్లి గేట్ల ఎత్తివేతతో గోదావరిలో కలుస్తున్న వరద నీరు

అతలాకుతలం



నెన్నెల: అప్రోచ్ రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న ఎర్రవాగు

- భారీ వర్షానికి పొంగిపొర్లుతున్న వాగులు
- వరదలతో కోతకు గురైన రోడ్లు, అప్రోచ్ వంతెనలు
- నీటమునిగిన పత్తి, వరి నారుమళ్లు
- 57 గ్రామాలకు స్తంభించిన రాకపోకలు
- పోటెత్తిన వరద.. పరవళ్లు తొక్కుతున్న గోదావరి
- ఓపెన్‌కాస్టుల్లో నిలిచిన బొగ్గు ఉత్పత్తి



నెన్నెలలో నీట మునిగిన పత్తి పంట

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం ముంచెత్తింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం 8.30గంటల వరకు 53 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. శనివారం ఉదయం 8.30గంటలకు భారీ వర్షం కురవడంతో మధ్యాహ్నం వరకు జనజీవనం స్తంభించింది. రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగి ప్రవహించి అతలాకుతలమైంది. చెరువులు, కాలువలకు గండ్లు పడడంతో పంట పొలాల్లోకి వరద నీరు చేరింది. కన్నెపల్లి, భీమిని, మందమర్రి, బెల్లంపల్లి, లక్సెట్టిపేట, కాసిపేట, నెన్నెల, కోటపల్లి మండలాల్లోని లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కోటపల్లి మండలం జనగామ గ్రామంలో చెన్నూర్ కవిత ఇల్లు కూలింది. పత్తి, వరి పొలాల్లో వరద నీరు చేరడంతో చెరువులను తలపించాయి. వేల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. ఎగువ ప్రాంతాల్లో నుంచి వస్తున్న వరద, కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో దిగువన ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీగా వరద చేరడంతో 11గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదలడంతో గోదావరి పరవళ్లు తొక్కుతోంది. ఎడతెరిపి లేని వర్షానికి శ్రీరాంపూర్, రామకృష్ణాపూర్, మందమర్రి ఏరియాల్లోని ఓపెన్‌కాస్టుల్లో భారీగా వరద నీరు చేరి 20వేల మెట్రిక్ టన్నుల వరకు బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయి రూ.కోట్ల నష్టం వాటిల్లింది.

స్తంభించిన రాకపోకలు

కన్నెపల్లి మండలంలో అత్యధికంగా 140.8 మిల్లీమీటర్లు, భీమిని మండలంలో 118.5మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కన్నెపల్లి, జజ్జరవెల్లి ఎర్రవాగు, చిన్నతిమ్మాపూర్ లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పట్టణ, గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయి అంధకారం నెలకొంది. ఒర్రెలు, వాగులపై నిర్మించిన చెక్‌డ్యాంలు పొంగి పొర్లడంతో 57 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పలు చోట్ల రహదారులు కోతకు గురయ్యాయి. కాసిపేట, భీమారం, వేమనపల్లి, నెన్నెల మండలాల్లో 24 గ్రామాలకు, కోటపల్లి మండలం ఎదులబంధం, తూతుంగ వాగు, నక్కలపల్లి ఒర్రె ఉప్పొంగడంతో 14గ్రామాలకు, భీమిని, కన్నెపల్లి మండలంలో ఎర్రవాగు, జన్కాపూర్ చెరువు, ఒర్రెలు పొంగి ప్రవహించడంతో 19గ్రామాలకు, నెన్నెల మండలం ఎర్రవాగు ఉప్పొంగడంతో దమ్మిరెడ్డిపేట, ఖర్జీ జంగల్‌పేట, కోనంపేట తదితర ఏడు గ్రామాలకు, చెన్నూర్ మండలంలో రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

గోదావరి పరవళ్లు

మహారాష్ట్రతోపాటు జిల్లాలో కురుస్తున్న వర్షాలకు ప్రాణహిత నది, గోదావరి నది పరవళ్లు తొక్కుతోంది. కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టులకు ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద నీరు వస్తుండడంతో గేట్లు ఎత్తి లక్షల క్యూసెక్కుల నీటిని దిగువన గోదావరిలోకి వదులుతున్నారు. నీల్వాయి ప్రాజెక్టు నుంచి 100 క్యూసెక్కులు మత్తడి ద్వారా దిగువకు వెళ్తోంది.

కాలనీలు జలమయం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగరంలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం వరకు కురిసిన వర్షానికి పలు కాలనీలు, లోతట్టు ప్రాంతాల్లో జలమయంగా మారాయి. హైటెక్ కాలనీలోని డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో వర్షపు నీరు రోడ్లపై నిలిచి చెరువును తలపించాయి. ప్రజలు బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. మార్కెట్‌లోని రోడ్లు జలమయం కాగా, పలు దుకాణాల్లోకి నీరు చేరింది. డ్రెయినేజీల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతోనే మురుగునీరు దుకాణాల్లోకి చేరిందని వాపోయారు. ఐబీ చౌరస్తా నుంచి శ్రీనివాస థియేటర్‌కు వెళ్లే దారిలో ఒక వైపు మాత్రమే డ్రెయినేజీ ఉండడం, వరద నీరు వెళ్లక రోడ్డుపై నిలిచి, ఇళ్లలోకి చేరి వస్తువులు పాడయ్యాయి. సూర్యనగర్, చున్నంబట్టివాడ, పాతమంచిర్యాలలోని శ్రీలక్ష్మీ కాలనీ, బృందావనం కాలనీల్లోని రోడ్లు, ఇళ్లను వరద నీరు చుట్టిముట్టింది. సూర్యనగర్‌లోని పలు ఇళ్లలోకి వరద నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. చున్నంబట్టి వాడలోని రోడ్లు నీట మునిగడంతో వాహనదారులు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. పాతమంచిర్యాలలోని శాలివాహన పవర్ ప్లాంటు నుంచి వరద నీరు సమీప కాలనీల్లోకి చేరింది. రాళ్లవాగు ఉప్పొంగి ప్రవహించగా, కాజ్‌వేపై వరద నీరు పెద్ద ఎత్తున ప్రవహించడంతో సమీప కాలనీ ప్రజలు భయాందోళన చెందారు. డీసీపీ భాస్కర్ రాళ్లవాగు, పట్టణంలోని లొతట్టు ప్రాంతాలను సందర్శించారు. రైల్వే అండర్‌బ్రిడ్జిలు, సీతారామ కాలనీ, బృందావనం కాలనీ, సూర్యనగర్ కాలనీల్లోని రోడ్లు వరదలో మునిగాయి.



హైటెక్‌సిటీ కాలనీ వీధుల్లో నిలిచిన నీరు



సూర్యనగర్ కాలనీలోని ఇళ్లల్లోకి చేరిన వరద



రాళ్లవాగు కాజ్‌వే పైనుంచి నీటి ప్రవాహం

ప్రాజెక్టుల్లో నీటిమట్టం వివరాలు

ప్రాజెక్టు	నీటి నిల్వ సామర్థ్యం (మీటర్లలో)	ప్రస్తుత నీటిమట్టం (మీటర్లలో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)
ర్యాలీవాగు	151.50	145.200	200
గొల్లవాగు	155.50	150.100	140.772
నీల్వాయి	124	124	900



వర్షపాతం(మిల్లీమీటర్లలో) వివరాలు	జన్నారం	దండేపల్లి	లక్సెట్టిపేట	హాజీపూర్	కాసిపేట	తాండూర్	భీమిని	కన్నెపల్లి	వేమనపల్లి	నెన్నెల	బెల్లంపల్లి	మందమర్రి	మంచిర్యాల	నస్పూర్	జైపూర్	భీమారం	చెన్నూర్	కోటపల్లి
శుక్రవారం రాత్రి నుంచి ఉదయం వరకు	54.2	32.8	56.1	44.4	92.1	15.8	9.7	31.5	84.6	74.9	40.5	52.1	38.2	38.4	61.1	54.3	74.8	98.1
శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు	32.5	68.3	49.5	67.5	42.8	65.0	118.5	140.5	10.0	102.3	62.3	30.3	68.3	58.6	24.3	23.3	17.8	22.5

'ఎల్లంపల్లి' 20 గేట్ల ఎత్తివేత

- ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు
- ఇన్‌ఫ్లో 2.16లక్షల క్యూసెక్కులు
- అవుట్‌ఫ్లో 3.13లక్షల క్యూసెక్కులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట వద్దనున్న ఎల్లంపల్లి(శ్రీపాదసాగర్) ప్రాజెక్టు గేట్లు శనివారం ఎత్తారు. దీంతో దిగువన గోదావరి నదిలోకి నీరు పరవళ్లు తొక్కుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలకు గాను శనివారం 18.750 టీఎంసీల నీటిమట్టంతో ఉంది. కడెం ప్రాజెక్టు నుంచి ఇన్‌ఫ్లో 1.62లక్షల క్యూసెక్కులు, ఎగువ ప్రాంతాల నుంచి 55వేల క్యూసెక్కులు మొత్తంగా 2.16లక్షల క్యూసెక్కుల నీరు ఎల్లంపల్లిలోకి చేరుతోంది. దీంతో సాయంత్రం 6గంటల నుంచి అధికారులు మొదట 10గేట్లు ఎత్తారు. రాత్రి 7గంటల ప్రాంతంలో 20గేట్లకు పెంచారు. గేట్లు ఎత్తడం ద్వారా 3.13లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 286 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కులు, నంది పంప్‌హౌజ్‌కు 12,600 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టులో నీటి మట్టం గంట గంటకు పెరుగుతోంది. కాగా, గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 15టీఎంసీల నీటిమట్టంతో ఉండగా గేట్లు ఎత్తలేదు.

జిల్లాకు వర్షసూచన

జిల్లాలో సాధారణ వర్షపాతం ఇప్పటి వరకు 626.2 మిల్లీమీటర్లు కాగా 536.5 మిల్లీమీటర్లు కురిసింది. సగటున ఇంకా 14 శాతం లోటు నెలకొంది. భీమిని మండలంలో 34శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఐదు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా ఇంకా 13 మండలాల్లో లోటు వర్షపాతం నెలకొంది. జిల్లాకు మరో నాలుగు రోజులపాటు ఆరెంజ్, ఎల్లో అలార్ట్ వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ సూచిస్తోంది.



లింగన్నపేట- ఎదులబంధం మధ్య దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్



తాండూర్: నర్సాపూర్ దారిలో వెళ్లకుండా ఏర్పాట్లు



లక్సెట్టిపేట: పోతపల్లి దారిలో నీటి ప్రవాహం



నెన్నెలలో ఇంట్లోకి చేరిన నీటిని బయటకు తోడేస్తున్న రైతు



ముల్కల్లలో జాతీయ రహదారిపై విరిగిపడిన చెట్టు



తాండూర్: అచ్చలాపూర్‌లో ఇంట్లోకి చేరిన నీరు



జన్నారం: శ్రీలంక కాలనీలో ఇంటిలోకి వరదనీరు

న్యూస్‌రీల్

ఘనంగా వాజ్‌పేయి వర్ధంతి



నివాళులు అర్పిస్తున్న వెంకటేశ్వర్‌గౌడ్

చెన్నూర్: చెన్నూర్ బీజేపీ కార్యాలయంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశ ప్రధానిగా చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మ శ్రీపాల్, నాయకులు బత్తుల సమ్మ య్య, కొండపాక చారి, జాడి తిరుపతి, ఎతం శివకృష్ణ, కేవీఎం శ్రీనివాస్, వెంకటనర్సయ్య, మంచాల రాజబాపు పాల్గొన్నారు.

కేకే-5 గనిలో మాక్ రిహార్సల్

మందమర్రిరూరల్: రెండ్రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి మందమర్రి ఏరియాలోని గనుల్లో పనులు కొంత మేరకు స్తంభించాయి. శనివారం కేకే-5 గని పైభాగంలో పాలవాగు ప్రమాదకర స్థాయిలో ప్రవహించింది. దీంతో గని అధికారులు మొదటి షిఫ్టు కార్మికులకు పలు సూచనలు చేశారు. సుమారు గంట సేపు గనిలో రక్షిత ప్రదేశానికి చేర్చి.. గనిలోకి వాగు నీరు ప్రవేశిస్తే తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై మాక్ రిహార్సల్ ద్వారా వివరించారు. వరద గనిలోకి వస్తే సైరన్ మోగిస్తారని గని ఏజెంట్ రాంబాబు, మేనేజర్ శంభునాథ్ పాండే తెలిపారు. సుమారు 30ఏళ్ల క్రితం పాలవాగు వరద ఉధృతికి రంధ్రం ఏర్పడి గనిలోకి వరద నీరు ప్రవేశించింది. అప్పుడు అధికారులు కార్మికులను అప్రమత్తం చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కాగా, వరద తీవ్రతను గమనించేందుకు పర్యవేక్షణ అధికారిని ఏర్పాటు చేశారు.

'ఇన్‌స్పైర్' అయ్యేదెలా..!

- జూలై ఒకటి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- 335 పాఠశాలల్లో 25 స్కూళ్ల నుంచే నామినేషన్లు
- వచ్చే నెల 15తో ముగియనున్న గడువు



ఆలోచనలు తెలియజేసే బాక్స్

మంచిర్యాలఅర్బన్: బాలల ఆలోచనలకు పదును పెడితే అద్భుతం ఆవిష్కృతమవుతుంది. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఏటా కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ మండలి నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా ఇన్‌స్పైర్ మనక్ పేరిట విజ్ఞాన మేళా నిర్వహిస్తోంది. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉంది. 2025–26 విద్యాసంవత్సరానికి ఇన్‌స్పైర్ పోటీలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు, కస్తూర్బా, గురుకుల విద్యాలయాల్లో ఆరు నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉన్నా స్పందన కరువైంది. జిల్లాలో 335పాఠశాలలు ఉండగా ఇప్పటివరకు 26 స్కూళ్ల నుంచి 115 ప్రాజెక్టుల నామినేషన్లు మాత్రమే వచ్చాయి. జూలై ఒకటి నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా, వచ్చే నెల 15తో గడువు ముగియనుంది. విద్యార్థుల ప్రతిభకు గుర్తింపు తీసుకొచ్చేందుకు చక్కని మార్గమైనా నామినేషన్లు అంతంత మాత్రమే వచ్చాయి. నిర్దిష్ట గడువులోగా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు స్పందిస్తేనే విద్యార్థులకు మేలు జరుగుతుంది.

పాఠశాలకు ఐదు చొప్పున

ప్రతీ పాఠశాల నుంచి తరగతికి ఒకటి చొప్పున ఐదు ప్రాజెక్టులు తయారు చేయాలని డీఈవో ఆదేశాలు జారీ చేశారు. ఆన్‌లైన్‌లో ఇన్‌స్పైర్ మనక్ కాంపిటీషన్ యాప్‌లో ప్రదర్శనకు సంబంధించిన వీడియో, ఆడియో, ఫొటోలు, పూర్తి వివరాలు అప్‌లోడ్ చేయాలి. జిల్లా స్థాయి ప్రదర్శన ఆన్‌లైన్‌లోనే న్యాయ నిర్ణయ ప్రక్రియ పూర్తి కానుంది. ఇక్కడ ఎంపికైన విద్యార్థులు రాష్ట్ర స్థాయికి అక్కడి నుంచి జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం లభిస్తుంది. మొదట విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను నిపుణులు పరిశీలించి జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేస్తారు. ఇలా ఎంపికైన ఒక్కో ప్రాజెక్టుకు రూ.10వేల చొప్పున ప్రోత్సాహకం విద్యార్థి బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎంపికైతే రూ.25వేలు, జాతీయ స్థాయిలోనూ ప్రతిభ చూపితే రాష్ట్రపతి భవన్, జపాన్ సందర్శనకు అవకాశం కల్పించే వీలుంది. ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రాజెక్టులు నమోదవుతున్నా ప్రైవేటు పాఠశాలల నుంచి ఆదరణ లేకుండా పోయింది. ఉపాధ్యాయుల పదోన్నతులు, అవగాహన లేమితో కొంతమేర ఇన్‌స్పైర్‌కు అడ్డంకిగా మారినట్లు తెలుస్తోంది.

బడిలో ఐడియా బాక్స్..

పాఠశాలల్లో దరఖాస్తుల స్వీకరణకు ఐడియా బాక్స్ ఏర్పాటు చేశారు. విద్యార్థుల్లో ఇన్‌స్పైర్‌పై అవగాహన కల్పించి వారి సృజనాత్మక ఆలోచనలు రాసి ఐడియా బాక్స్‌లో వేయాలి. స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో భౌతిక, రసాయనశాస్త్ర, జీవశాస్త్ర, గణిత, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు నాణ్యమైన ఆవిష్కరణలపై శిక్షణ ఇచ్చారు. టీచర్లు విద్యార్థులు ఐడియా బాక్స్‌లో వేసిన ప్రాజెక్టు ఆలోచనలకు తుది మెరుగులు దిద్ది ప్రాజెక్టు రూపేణ తీసుకురావాల్సి ఉంది. నెలన్నర గడుస్తున్నా ఆశించిన మేర నామినేషన్ల దరఖాస్తులు రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది.

గడువులోపు వచ్చేలా చర్యలు

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం ఏటా ఇన్‌స్పైర్ మనక్ అవార్డు పోటీలు నిర్వహిస్తోంది. దరఖాస్తుల స్వీకరణ జరుగుతోంది. నిర్దిష్ట గడువులోగా అధిక దరఖాస్తులు వచ్చేలా విద్యాశాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతాం. విస్తృత ప్రచారం చేపట్టడం, మరోసారి టీచర్లకు అవగాహన కల్పించి కొత్త ఆవిష్కరణలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేలా చొరవ చూపి విద్యార్థుల్లో ఆసక్తి కలిగించేలా కృషి చేస్తాం.

– రాజగోపాల్, జిల్లా సైన్స్ అధికారి

ప్రజలు ఆందోళన చెందవద్దు

- విస్తృతంగా ముందస్తు జాగ్రత్త చర్యలు
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. శనివారం గుడిపేట శివారులోని ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌ను కలెక్టర్ కుమార్ దీపక్ ప్రాజెక్ట్ అధికారులతో కలిసి సందర్శించారు. వరదలు, వర్షాలకు సంబంధించి అత్యవసర సేవలకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం నంబర్ 08736–250501లో సంప్రదించాలని తెలిపారు. ప్రాజెక్ట్ ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లోలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని తెలిపారు. కడెం ప్రాజెక్ట్ నుంచి భారీ నీటి విడుదలతో వరద ఉధృతి పెరిగే అవకాశంతోపాటు రానున్న 36 గంటల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు ఉన్నందున రెడ్ అలర్ట్‌గా ప్రకటిస్తున్నట్లు తెలిపారు. 90 మంది సభ్యులతో కూడిన 3 ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, గజ ఈతగాళ్లు అందుబాటులో ఉన్నారని తెలిపారు. లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ముందస్తుగా పునరావాస ఏర్పాట్లు సిద్ధం చేశామని తెలిపారు.



ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌పై ఆరా తీస్తున్న కలెక్టర్ కుమార్

ఎల్లంపల్లి డీఈ బుచ్చిబాబు, హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే ఉన్నారు. కాగా, ఎల్లంపల్లి ప్రాజెక్ట్ గేట్లు తెరుస్తున్నారనే సమాచారం తెలియడంతో పర్యాటకుల తాకిడి పెరిగింది.

దెబ్బతిన్న రోడ్డు పరిశీలన

కోటపల్లి: మండలంలోని లింగన్నపేట–ఎదులబంధం గ్రామాల మధ్య తుతుంగ వాగు ఉధృతికి రోడ్డు దెబ్బతిని పది గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కలెక్టర్ శనివారం సందర్శించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వరద ఉధృతి తగ్గిన తర్వాత రోడ్డు మరమ్మతు చేయాలని ఆర్ అండ్‌బీ అధికారులను ఆదేశించారు.

వాగులో చిక్కుకున్న యువకులు

- తాళ్ల సహాయంతో కాపాడిన స్థానికులు

కాసిపేట: మండలంలోని బుగ్గ చెరువు మత్తడిలో చిక్కుకున్న యువకులను స్థానికులు తాళ్ల సహాయంతో కాపాడారు. శనివారం మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో బుగ్గగూడెంకు చెందిన మార్నేని సంజీవ్, మార్నేని సంతోష్, మార్నేని సాగర్, బద్ది అరుణ్, ఏదుల శశికుమార్ బుగ్గ చెరువు మత్తడి వాగు దాటి చేపలు పట్టేందుకు అవతలి ఒడ్డుకు వెళ్లారు. వర్షాలకు వాగు ఉధృతి పెరిగింది. దీంతో మొదటి మత్తడి దాటిన యువకులు అటు వైపు కొంత దూరంలో రెండో మత్తడి ఉండడంతో అలాగే ఉండిపోయారు. మార్నేని సంతోష్ ప్రమాదపు అంచున ఇటువైపునకు దాటగా.. మిగతా నలుగురు అటు వైపు ఉండిపోయారు. స్థానిక రైతులు గంటన్నరపాటు ప్రయత్నించి తాడు సహాయంతో ఒక్కొక్కరిని ఇవతలి వైపు దాటించారు.



వాగు ఒడ్డున వేచి చూస్తున్న యువకులు

ఆదివాసీల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

కోటపల్లి: ఆదివాసీల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వాలు పనిచేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్ అన్నారు. శనివారం సుపాక గ్రామంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా ఆదివాసీల సభలో ఆయన మాట్లాడారు. అటవీ హక్కుల చట్టాలను తుంగలో తొక్కుతూ అడవులను కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికి 2023నూతన అటవీ సంరక్షణ చట్టం తీసుకవచ్చారని అన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం, నాయకులు నెర్పల్లి అశోక్, తలండి ముత్తయ్య, మడే వెంకటస్వామి, మల్లేశ్, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు సంకే రవి, కిసాన్‌మిత్ర జిల్లా కో ఆర్డినేటర్ సిడం రమేశ్, మత్స్యకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి చందు, మాజీ సర్పంచ్ లక్ష్మణ్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ తిరుపతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్

ముంపు ప్రాంతాల సందర్శన



వీరపూర్‌లో పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మనోజ్

భీమిని: కన్నెపల్లి మండలంలో వర్షాలతో ముంపునకు గురైన ప్రాంతాలను బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ శనివారం పరిశీలించారు. కన్నెపల్లి మండలం వీరపూర్ దుబ్బగూడెం ప్రాజెక్టుకు వెళ్లే దారిలో రోడ్డు కోతకు గురి కాగా అటు వెళ్లలేకపోయారు. గ్రామస్తులతో మాట్లాడారు. నష్టపోయిన పంటలకు పరిహారం అందేలా చూడాలని బీఆర్‌ఎస్ నాయకుడు మహేశ్‌గౌడ్ కోరారు. అనంతరం మండలంలోని నీట మునిగిన పంటలను పరిశీలించారు.

కాంగ్రెస్ నాయకులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ కార్యక్రమాల్లో కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొనడాన్ని బీఆర్‌ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. సన్నబియ్యం పంపిణీ, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు వంటి పలు ప్రభుత్వ కార్యక్రమాలను అధికారుల సమక్షంలోనే కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని, వారి చేతుల మీదుగా అందిస్తున్నారంటూ మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు శనివారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నెల 15న కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు, ఏప్రిల్ 1న సన్నబియ్యం పంపిణీ డీసీసీ అధ్యక్షురాలు చేశారని, గత నెల 24న రేషన్‌కార్డులను జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ నాయకుల చేతుల మీదుగా అందించారని పేర్కొన్నారు.

క్లుప్తంగా

షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు


ప్రమాదానికి గురైన ఇల్లు

జన్నారం: మండల కేంద్రంలోని ధర్మారం రోడ్డులో సతీశ్‌గౌడ్ ఇంట్లో శనివారం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఏసీ దగ్ధం కాగా, మంచం, బీరువాలో బట్టలు, సామగ్రి, డబ్బులు కాలిపోయాయి. సమాచారం అందగానే ఫైర్ సిబ్బంది అక్కడికి వెళ్లి మంటలార్పివేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల నష్టం వాటిల్లినట్లు ఇన్‌చార్జి ఫైర్ అధికారి రవీందర్‌రెడ్డి తెలిపారు.

వృద్ధుడికి ఆశ్రయం

పాతమంచిర్యాల: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం బోడేపల్లిలో వృద్ధుడు నడవలేని స్థితిలో ఉన్నాడు. ఈ విషయాన్ని స్థానికులు ఎస్సై విక్రమ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన.. ఎస్పీ కాంతిలాల్ పాటిల్‌కు చేరవేశాడు. దీంతో పోలీసులు మంచిర్యాలలోని కల్వరీ యువశక్తి అనాథాశ్రమ నిర్వాహకుడు ములుకాల కుమార్‌కు సమాచారమిచ్చారు. పోలీసులు సదరు వృద్ధుడిని శనివారం కల్వరీ యువశక్తి అనాథాశ్రమానికి తరలించి ఆశ్రయం కల్పించారు.

మూగజీవాలను కాపాడిన హెడ్‌కానిస్టేబుల్


మూగజీవాలతో హెడ్ కానిస్టేబుల్ జంగు

రామకృష్ణాపూర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పట్టణంలోని కార్మిక వాడలకు భారీగా వరద నీరు చేరింది. ఆర్‌కే1 ఏరియా శివారులో పాలవాగుకు అనుకుని ఉన్న ఓ వ్యవసాయ భూమిలో పశువుల కోసం ఏర్పాటు చేసిన కొట్టం వరద నీటిలో మునిగిపోతుండగా ఆవుల ఆర్తనాదం విన్నవారు శనివారం పోలీసులకు సమాచారమిచ్చారు. పట్టణ ఎస్సై రాజశేఖర్ వెంటనే స్పందించి హెడ్ కానిస్టేబుల్ జంగును పంపించాడు. వరద ఉధృతిలో ప్రాణాలకు తెగించి ఒక కర్ర సహాయంతో ఈదుకుంటూ వెళ్లి మూగజీవాలను రక్షించాడు. హెడ్ కానిస్టేబుల్‌ను ఎస్సై, సీఐ శశిధర్‌రెడ్డితోపాటు పలువురు ఉన్నతాధికారులు అభినందించారు.

కూలిన చెట్టు.. తప్పిన ప్రమాదం


ప్రమాదానికి గురైన కారు

ఉట్నూర్‌రూరల్: ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని దంతన్‌పల్లి సమీపంలో భారీ చెట్టు కూలింది. శనివారం తెల్లవారు జామున ఉట్నూర్ వైపు నుంచి జన్నారం వైపు కారులో ఓ కుటుంబం వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. డ్రైవర్ ఒక్కసారిగా కారు ఆపడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది.

గిరిజనేతరుల చేతిలో వేల ఎకరాలు

- అటవీ భూముల ఆక్రమణలో ఎస్సీ, బీసీలు
- స్వాధీనానికి అటవీ శాఖ యత్నం
- హక్కులు కల్పించాలంటూ డిమాండ్లు


ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం దిందాలో సాగులో ఉన్న అటవీ భూమి(ఫైల్)

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అటవీ భూములు సాగు చేస్తున్న వేలాది గిరిజనేతరులు తమకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా బీసీ, ఎస్సీలు అటవీ భూముల ఆధారంగానే జీవిస్తూ సాగు చేసుకుంటున్నారు. గిరిజనులకు ఆర్వోఎఫ్ఆర్(అటవీ హక్కుల గుర్తింపు) కింద పట్టాలు ఇచ్చారు. కానీ గిరిజనేతరులకు అవకాశం లేదు. దీంతో ఏటా సీజన్‌లో ఆ భూముల్లో విత్తనాలు వేసే సమయంలో ఆక్రమణదారులు, అటవీ అధికారుల మధ్య ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. కొన్ని చోట్ల తిరిగి స్వాధీనం చేసుకుని మొక్కలు నాటుతున్నారు. తాజాగా ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం దిందా గ్రామస్తులను అటవీ అధికారులు సాగు చేసుకోకుండా అడ్డుకుంటున్నారని సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు పాదయాత్ర చేపట్టగా, మధ్యలోనే పోలీసులు అడ్డుకుని తీసుకొచ్చారు.

బీసీ, ఎస్సీలు అధికం

అటవీ భూములను గిరిజనులతోపాటు బీసీ, ఎస్సీ ఇతర వర్గాలు వేలాది మంది సాగు చేస్తున్నారు. వీరికి సైతం పట్టాలు ఇవ్వాలని డిమాండ్లు వచ్చినప్పటికీ ప్రభుత్వం పక్కన పెట్టింది. మూడేళ్ల క్రితం రాష్ట్రవ్యాప్తంగా 1.50లక్షల మంది గిరిజన రైతులకు 4.05లక్షల ఎకరాల్లో హక్కులు కల్పించారు. చట్టం ప్రకారం గిరిజనులకు మాత్రమే హక్కులు ఉన్నాయి. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాద్ జిల్లాల్లోనూ గిరిజనేతరులు సాగులో ఉన్నారు. రిజర్వు ఫారెస్టుతోపాటు పులుల సంరక్షణ కేంద్రమైన కవ్వాల్ పరిధిలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇంకా 1.29లక్షల ఎకరాలు ఆక్రమణలో ఉంది. గిరిజనేతరులతోపాటు కొన్ని చోట్ల గిరిజనులు సైతం కొత్తగా ఆక్రమణలకు పాల్పడుతుండడంతో అడవుల సంరక్షణ మరింత ఇబ్బందిగా మారిందని అధికారులు వాపోతున్నారు.

అధికారుల నిర్లక్ష్యమే..

నిజాం కాలం నుంచే అటవీ ఆక్రమణలు ఉన్నప్పటికీ గత 20ఏళ్లలో ఈ ఆక్రమణలు తీవ్రంగా పెరిగాయి. పత్తి సాగు మొదలైనప్పటి నుంచి గిరిజనులతోపాటు గిరిజనేతరులు సైతం పెద్ద ఎత్తున చెట్లను నరికి సాగులోకి వచ్చారు. ఆ సమయంలో కొంతమంది సిబ్బంది అవినీతితో ఇష్టారీతిన ఆక్రమణలు జరిగాయి. మరికొన్ని చోట్ల రాజకీయ ఒత్తిళ్లు, అధికారుల నిర్లక్ష్యం, తదితర కారణాలతోనూ రిజర్వు ఫారెస్టుల్లో సాగు మొదలైంది. ఆ భూములే తిరిగి స్వాధీనం చేసుకోవాలంటే సామాజిక సమస్యగా మారింది.

దిందాలో ఒక్కొక్కరు 40ఎకరాల వరకు..

ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం బందెపల్లి, దిందాలో పరిధిలో ఒక్కో కుటుంబం ఎకరం నుంచి 42ఎకరాల వరకు ఆక్రమించారు. ఇందులో పది నుంచి 30ఎకరాల వరకు సాగులో ఉన్నారు. ఇక్కడ 530ఎకరాల్లో గిరిజనులకు పట్టాలు ఇచ్చారు. రిజర్వు ఫారెస్టులో 2600ఎకరాలు ఆక్రమణలో ఉంది. అయితే 600ఎకరాలను సాగుదారులకు వదిలేశారు. మిగతాది గిరిజనేతరుల నుంచి స్వాధీనం చేసుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తుండగా వివాదం రాజుకుంటోంది.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి


ఎర్రవాగును పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మనోజ్

నెన్నెల: మండలంలో కురుస్తున్న భారీ వర్షాలు దృష్టిలో ఉంచుకొని అప్రమత్తంగా ఉండాలని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ అధికారులకు సూచించారు. మండల కేంద్రంలో జలమయమైన ప్రాంతాలు, వాగులను శనివారం పరిశీలించారు. సుంకరివాడలోని నారాయణ, పురంశెట్టి రాకేశ్ ఇళ్లలోకి చేరిన వర్షపు నీటిని తొలగించాలని ఎంపీవో శ్రీనివాస్, కార్యదర్శి సురేశ్‌ను ఆదేశించారు. ఇళ్లలో నిలిచిన నీరు బయటకు వెళ్లేలా నూతనంగా వేసిన సీసీ రోడ్డు పక్క నుంచి కాలువ తీయాలని, నీళ్లు వెళ్లేందుకు అడ్డంగా ఉన్న మెట్లు తొలగించాలని సూచించారు. తహసీల్దార్, మండల పరిషత్, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ నిలిచిన నీటిని తొలగించే ఏర్పాట్లు చేయాలన్నారు. కొత్తగూడంలో ఏర్పడిన కుమ్మరివాగు ప్రాజెక్టు ఎడమ కాల్వ గండిని సందర్శించి వెంటనే ఇసుక బస్తాలతో పూడ్చాలని ఇరిగేషన్ ఏఈని ఫోన్‌లో ఆదేశించారు. లంబాడితండా ఎర్రవాగును సందర్శించి పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన సహాయక చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో అబ్దుల్‌హై, ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

చిరుత సంచారం


పాదముద్ర సేకరిస్తున్న అటవీ అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని సార్సాల పరిసరాల్లో చిరుత సంచరించింది. శుక్రవారం రాత్రి బూరం పోచన్నకు చెందిన గేదె దూడపై దాడి చేసి హతమార్చింది. అదే ప్రాంతంలో కుక్కపై దాడి చేసి చంపింది. శనివారం తెల్లవారు జాము ఓ మహిళకు చెందిన పశువులపై దాడికి యత్నించడంతో అవి తప్పించుకున్నాయని గ్రామస్తులు తెలిపారు. శనివారం ఫారెస్ట్ సెక్షన్ అధికారి సుభాన్, బీట్ అధికారి శ్రీవాణి, సిబ్బందితో సందర్శించి చిరుత పాదముద్రలను సేకరించారు. తక్షణ సహాయం కింద గేదె దూడ యజమానికి రూ.5 వేల పరిహారం అందజేశారు. చిరుతపులి సంచారంపై డప్పు చాటింపు చేశారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బాల్ బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా ఎంపిక పోటీలు


ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

రెబ్బెన: గోలేటిలో ఈనెల 23, 24 తేదీల్లో నిర్వహించే అంతర్ జిల్లాల బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు సత్తాచాటాలని బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.తిరుపతి పేర్కొన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం బాల్ బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా పురుషులు, మహిళల క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. సుమారు 40 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులకు ఈనెల 17 నుంచి 21 వరకు సింగరేణి క్రీడామైదానంలో శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇందులో ప్రతిభ చూపినవారిని జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సీపీఐ పట్టణ కార్యదర్శి మారం శ్రీనివాస్, జిల్లా సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు మహేందర్‌రెడ్డి, భాస్కర్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు చందర్ ఏఐటీయూసీ నాయకులు జగ్గయ్య, క్రీడాకారుడు నరేశ్ పాల్గొన్నారు.

శిక్షణ శిబిరానికి ఎంపిక

ఉమ్మడి జిల్లా పురుషుల జట్టుకు కె.సిద్దార్థ్, ఎం.తిరుపతి, పి.పవన్‌కుమార్, కె. తరుణ్, జి.గోపాల్, పి.శ్రీకాంత్, సాయి చరణ్, టి.దిలీప్‌కుమార్, పి.దేవరాజ్, ఎం.సూర్యకుమార్, ప్రేంకుమార్, సీహెచ్ గోపాలకృష్ణ, సీహెచ్ వరణ్ ఎంపికయ్యారు. మహిళల జట్టుకు ఏ.స్వప్న, కె.అంజలి, డి.శ్రావణి, జి.అనూష, కె.శ్రీస్ఫూర్తి కారుణ్య, టి.ప్రజ్వల శ్రీ, పి.వర్షిణి, సుజాత, సాయిదీక్ష, సంజన, అర్చన, వైష్ణవి, హారిక ఎంపికయ్యారు.

క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలి

- బేస్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు హరిశంకర్
- ప్రారంభమైన రాష్ట్రస్థాయి పోటీలు


పోటీలు ప్రారంభిస్తున్న హరిశంకర్

ఆదిలాబాద్: క్రీడాకారులంతా క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని రాష్ట్ర బేస్‌బాల్ సంఘం అధ్యక్షుడు చల్లా హరిశంకర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో తెలంగాణ 5వ సీనియర్ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ చాంపియన్‌షిప్ (మహిళలు–పురుషులు) పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, రెండింటిని సమానంగా స్వీకరించాలన్నారు. క్రీడాభివృద్ధికి ఎంతగానో పాటుపడుతున్నామన్నారు. రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. పది రోజుల పాటు శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తామని వివరించారు. పోటీల్లో రాష్ట్ర జట్టు విజేతగా నిలిపేందుకు కృషి చేస్తామన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్.శ్వేత మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంతోమంది ప్రతిభగల క్రీడాకారులు ఉన్నారని పేర్కొన్నారు. క్రీడల్లో రాణించినవారికి గొప్ప భవిష్యత్తు ఉంటుందన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కలాల శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం శుభపరిణామన్నారు. 33 జిల్లాల నుంచి సుమారు 700 క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో జక్కుల శ్రీనివాస్, అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి డా.కృష్ణ, అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పందిరి జ్యోతి, ఉపాధ్యక్షుడు లోక ప్రవీణ్‌రెడ్డి, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తు, వ్యాయామ ఉపాధ్యాయులు దయానందరెడ్డి, హరిచరణ్, రామ్‌కుమార్, జిల్లాల నుంచి కార్యదర్శులు, కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.

తొలిరోజు విజేతలు

పురుషుల విభాగంలో ఆదిలాబాద్ కరీంనగర్ జట్టుపై 6–1తో, హైదరాబాద్ నిర్మల్ జట్టుపై 7–1తో, మహబూబ్‌నగర్ సిద్దిపేట జట్టుపై 7–2తో విజేతలుగా నిలిచాయి. మహిళల విభాగంలో నిజామాబాద్ జట్టు సిద్దిపేటపై 9–0తో, కరీంనగర్ జట్టు మహబూబాబాద్ జట్టుపై 6–5తో, నల్గొండ జట్టు ఆసిఫాబాద్ జట్టుపై 7–4తో విజేతలుగా నిలిచాయి.

గర్భిణుల తరలింపు


అంబులెన్స్‌లో తరలిస్తున్న వైద్యసిబ్బంది

వేమనపల్లి: భారీ వర్షాలు దృష్ట్యా శనివారం వేమనపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేష్ ఆధ్వర్యంలో లోతట్టు గ్రామాల్లోని గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కళ్లెంపల్లి, జాజులపేట, సుంపుటం గ్రామాలకు చెందిన భారతి, శకుంతల, రోజును వేమనపల్లి పీహెచ్‌సీ నుంచి అంబులెన్స్‌లో చెన్నూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇన్‌చార్జి హెల్త్ సూపర్‌వైజర్ రాంశెట్టి బాపు, ఏఎన్ఎం మంజుల, రాజ్యలక్ష్మి, ఈఎంటీ జనార్దన్, పైలెట్ సంపత్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన ఇద్దరిపై కేసు

జన్నారం: కులం పేరుతో దూషించిన ఇద్దరిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై గొల్లపెల్లి అనూష తెలిపారు. ఆమె కథనం ప్రకారం ..లక్సెట్టిపేట మండలం ఎల్లారం గ్రామానికి చెందిన రామంటెంకి శ్రీనివాస్‌కు జన్నారం మండలం రేండ్లగూడ శివారులోని సర్వేనంబర్ 158/4లో ఎకరం పొలం ఉంది. రేండ్లగూడకు చెందిన బాల్త రాజమౌళి ఈ పొలాన్ని దున్నించాడు. ఈనెల 13న రామటెంకి శ్రీనివాస్, తండ్రి రాజలింగుతో కలిసి అక్కడికి వెళ్లి తిరిగివస్తున్నారు. పాతకక్షలు మనస్సులో పెట్టుకుని బాల్త రాజమౌళి, బాల్త భూమక్కలు శ్రీనివాస్, రాజలింగును కులం పేరుతో దూషించారు. శ్రీనివాస్ ఫిర్యాదుతో శనివారం ఇద్దరిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఆత్మహత్య

కుంటాల: మండలంలోని లింబా(బి) గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ గాండ్ల సాయినాథ్ (40) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై అశోక్ కథనం ప్రకారం.. సాయినాథ్‌కు గత 20 ఏళ్ల క్రితం రజితతో వివాహమైంది. ఇప్పటివరకు సంతానం కాలేదు. దివ్యాంగుడు కాగా, మద్యానికి బానిసయ్యాడు. శనివారం ఇంట్లో దూలానికి ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి అశోక్ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

మతిస్థిమితంలేని వృద్ధుడు

సిర్పూర్(టి): మండలంలోని నవేగాం గ్రామానికి చెందిన రాంటెంకి రుషి(60) శుక్రవారం పెన్‌గంగ నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై కమలాకర్ కథనం ప్రకారం.. రుషి గత కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతుండేవాడు. శుక్రవారం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. దహెగాం మండలకేంద్రం శివారులో పత్తి చేనులో అతని బట్టలు దొరకగా శనివారం ఉదయం పెన్‌గంగ నదిలో మృతదేహం ఆచూకీ లభ్యమైంది. మృతుడి పెద్దనాన్న కుమార్తె యశోదాబాయి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అడవిపంది దాడిలో వ్యక్తి మృతి


భీమిని: అడవిపంది దాడిలో వ్యక్తి మృతిచెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. కన్నెపల్లి ఎస్సై భాస్కర్‌రావు, స్థానికులు తెలిపిన వివరాలు.. భీమిని మండలం వెంకటపూర్‌కు చెందిన దాగామ రామయ్య (70) కన్నెపల్లి మండలం సుర్జాపూర్ శివారులో శనివారం పత్తి చేనుకు వెళ్లి వస్తున్నాడు. ఈక్రమంలో అడవి పంది దాడిలో అతడు గాయపడ్డాడు. పక్క చేనులో ఉన్న రైతులు గట్టిగా కేకలు వేయగా అది పరిగెత్తింది. రామయ్యను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. అక్కడి నుంచి వెళ్లిన అడవి పంది గురుండ్ల చిరంజీవి, మేకల బాపులపై దాడి చేసి గాయపర్చింది. ఫారెస్ట్ అధికారులు సిబ్బంది, మరికొందరితో కలసి పట్టుకునేందుకు వెళ్లగా అందులో ఒకరిని గాయపర్చినట్లు తెలిసింది. మృతుడి కుమారుడు రాజేశం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'కనకాయి'.. పరవళ్లు




బజార్‌హత్నూర్ మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు కడెం, బండ్రేవ్, బోస్రా వాగుల్లో వరద నీరు పోటెత్తింది. కడెం నదిపై గల కనకాయి జలపాతం పరవళ్లు తొక్కింది. వీటిని తిలకించేందుకు పర్యాటకులు తరలివచ్చారు. ఇక్కడ పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు. – బజార్‌హత్నూర్

ఎస్సారెస్పీకి పోటెత్తిన వరద


శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వ

ఎస్సారెస్పీ ఎగువన మహారాష్ట్రలో వర్షాలు కురుస్తుండడంతో ప్రాజెక్టులోకి భారీగా వరద పోటెత్తింది. శనివారం 1.04 లక్షల క్యూసెక్కుల వరద నీరు చేరింది. పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులకు ప్రస్తుతం 1083 అడుగులు ఉంది. 80.5 టీఎంసీలకుగాను 53.62 టీఎంసీలకు చేరింది. ప్రాజెక్ట్ నుంచి 5 వేల క్యూసెక్కుల నీటిని కాకతీయ కాలువ, మిషన్ భగీరథకు వదులుతున్నారు. గోదావరిలో భారీగా వరద నీరు చేరే అవకాశం ఉన్నందున పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్ట్ అధికారులు సూచించారు. పశువుల, గొర్రెల కాపర్లు, చేపలు పట్టేవారు, రైతులు గోదావరి నదిని దాటే ప్రయత్నం చేయొద్దని పేర్కొన్నారు. – మామడ

'పొచ్చెర' ఉరకలు


అలుగు పారుతున్న కరత్వాడ ప్రాజెక్టు

రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి పొచ్చెర జలపాతం ఉరకలెత్తింది. శనివారం భారీ వరద నీరు చేరడంతో జలపాతం నిండుకుండలా మారింది. కరత్వాడ ప్రాజెక్టు నిండిపోవడంతో అలుగు పారింది. ప్రాజెక్టును చూడటానికి సందర్శకులు తరలివచ్చారు. పొచ్చెర జలపాతం అందాలు చూసేందుకు అటవీ అధికారులు అనుమతి ఇవ్వలేదు. – బోథ్


ఉరకలెత్తుతున్న పొచ్చెర జలపాతం

కడెం వరదలో వ్యక్తి గల్లంతు

- చేపల కోసం కడెం గేట్ల కిందకు వెళ్లి..
- ప్రవాహం పెరిగి, నీటిలో కొట్టుకుపోయి
- రాత్రివేళ గాలింపు నిలిపివేత


పాండ్వపూర్ బ్రిడ్జి వద్ద కొట్టుకువస్తున్న గంగాధర్


తిప్పిరెడ్డి గంగాధర్ (ఫైల్)

కడెం/దస్తురాబాద్: చేపల వేటకు వెళ్లి కడెం వరదలో చిక్కుకుని ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. కడెం మండలం కన్నాపూర్‌కు చెందిన తిప్పిరెడ్డి గంగాధర్ (45) శనివారం కడెం గేట్లు ఎత్తడంతో కుమారుడు, మరో వ్యక్తితో కలిసి ప్రాజెక్ట్ గేట్ల దిగువన వెళ్లాడు. రెండు గేట్లు మూసివేయడంతో నీటి ప్రవాహం తగ్గిందని కర్రలతో చేపలు వేటాడేందుకు వెళ్లాడు. అరగంట తర్వాత ఇన్‌ఫ్లో పెరగడంతో అధికారులు సైరన్ మోగించి మరో రెండు గేట్లు ఎత్తారు. సమీపంలో వందలాది మంది కేకలు వేసిన గంగాధర్ ఫోన్ చూస్తుండగా ఒక్కసారిగా చుట్టూ నీళ్లు చేరాయి. బయటకు రాలేక, కొద్ది దూరంలో బండపై నిల్చొని కాపాడండి అంటూ కేకలు వేశాడు. వరద ప్రవాహం పెరగడంతో అందరు చూస్తుండగానే నీటిలో కొట్టుకుపోయాడు. 3 కి.మీ మేర మునుగుతూ, తేలుతూ ఈదుతున్నాడు. పాండ్వపూర్ సమీపంలో కడెం వంతెనను దాటి వెళ్లడం అక్కడే ఉన్నవారు, కానిస్టేబుళ్లు నాగరాజు, వంశీ గమనించారు. చెట్లపొదల పక్క నుంచి కొట్టుకుపోతున్న అతన్ని కాపాడేందుకు పరిగెత్తి ప్రయత్నించారు. సుమారు 3 కి.మీ మేర బురదలో వెళ్లిన ఫలితం దక్కలేదు. అదేవిధంగా దస్తురాబాద్ మండలం భూత్కూర్ పంచాయతీ రాంపూర్ గోదావరి తీర ప్రాంతంలో ఎన్డీఆర్ఎఫ్ బృందం గాలింపు చేపట్టింది. ఎస్సై సాయికుమార్, తహసీల్దార్ విశ్వంబర్ అక్కడికి చేరుకున్నారు. పరిస్థితిని సమీక్షించి ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించారు. గల్లంతైన వ్యక్తి ఆచూకీ దొరకకపోవడం, రాత్రి కావడం, వరద ప్రవాహం పెరగడంతో గాలింపును నిలిపివేశారు. కడెం ప్రాజెక్ట్ వద్ద ఉన్న ఎన్డీఆర్ఎఫ్ బృందం స్పందిస్తే వరదల్లో గంగాధర్‌ను బయటకు తీసుకువచ్చేవారని స్థానికులు వాపోయారు. గంగాధర్‌కు భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఉపాధి నిమిత్తం బిస్కెట్లు, కేక్‌లు, చాక్లెట్లు తదితర బేకరీ ఐటెమ్స్‌ను షాపులకు విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నాడు.

కేకలు వేశాం

కడెం గేట్లు దూరాన ఉన్న మేము బయటకు రావాలని కేకలు వేశాం. అతను గమనించలేదు. నేను పోతున్నా అంటూ గట్టిగా అరిచాడు. 20 నిమిషాల వ్యవధిలో వరదలో కొట్టుకుపోయాడు. – వినయ్, ప్రత్యక్ష సాక్షి

ప్రయాణికులను కాపాడిన సీఐ


రక్షించిన ప్రయాణికులతో సీఐ సాయిరమణ

ఖానాపురం: వరద నీటిలో చిక్కుకున్న ఓ కుటుంబాన్ని వరంగల్ జిల్లా దుగ్గొండి సీఐ సాయిరమణ కాపాడారు. వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లాకు చెందిన బాస లక్ష్మీనారాయణ, అన్నపూర్ణ, రితిక, రితిన్ భద్రాచలానికి కారులో వెళ్తున్నారు. ఖానాపురం మండలంలోని చిలుకమ్మనగర్–కొత్తగూడ మధ్యలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీటిలో చిక్కుకుపోయారు. వెంటనే లక్ష్మీనారాయణ పోలీసులకు సమాచారం అందించారు. డీజీ కంట్రోల్ కార్యాలయం నుంచి స్థానిక పోలీసులకు సమాచారం అందడంతో సీఐ సాయిరమణ శనివారం తెల్లవారు జామున 3 గంటలకు చిలుకమ్మనగర్‌కు చేరుకుని గ్రామస్తుల సహకారంతో వారిని క్షేమంగా బయటకు తీసుకొచ్చారు. సదరు కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.